ఎన్నికల నిర్వహణలో బీఎల్వోల పాత్ర కీలకం

- విధులు జాగ్రత్తగా నిర్వర్తించాలి
- బీఎల్వోల సమావేశంలో రిటర్నింగ్ అధికారి మనోరమ



బీఎవోలకు సూచనలిస్తున్న రిటర్నింగ్ అధికారి మనోరమ

యలమంచిలి రూరల్ : ఎన్నికల నిర్వహణలో బీఎల్వోల పాత్ర చాలా కీలకమని యలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.మనోరమ అన్నారు. ఎన్నికల నిర్వహణలో చిన్న పొరపాటు జరిగినా మొత్తం ప్రక్రియకు అడ్డంకులు ఎదురవుతాయని, ప్రతి ఒక్క బూత్ లెవల్ అధికారి(బీఎల్వో) ఎలాంటి పొరపాట్లు, నిర్లక్ష్యం లేకుండా ఎన్నికల విధులు నిర్వహించాలన్నారు. బుధవారం యలమంచిలి తహసీల్దార్ కార్యాలయంలో నాలుగు మండలాల బీఎల్వోలతో నిర్వహించిన ఎన్నికల సన్నద్ధతా సమావేశంలో ఆమె పలు సూచనలు చేశారు. పోలింగ్ మొదలుకుని కౌంటింగ్ పూర్తయ్యే వరకు బీఎల్వోలు ఎలాంటి ఒత్తిళ్లు, ఆరోపణలకు తావివ్వకుండా పని చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి కఠినంగా అమలు చేయాల్సిన బాధ్యత మీపై ఉందని, ఇక నుంచి ప్రతి బీఎల్వో వారి వారి పోలింగ్ బూత్‌ల పరిధిలోనే నివాసం ఉండి ఎప్పటికపుడు సమాచారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చి క్రియాశీలకంగా వ్యవహరించాలని అన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలకు సకాలంలో సమాచారం ఇవ్వడంతోపాటు గ్రామాలకు వచ్చినపుడు వారికి కచ్చితమైన సమాచారాన్ని అందజేయాలన్నారు. ఓటర్లంతా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేలా వారిలో చైతన్యం తేవాలన్నారు. సీ విజిల్‌కు వచ్చే ఫిర్యాదులను 100 నిమిషాల వ్యవధిలో పరిష్కరించాల్సిన బాధ్యత ఉందని, అందుచేత ఆ ఫిర్యాదులపై తక్షణ స్పందన అవసరమన్నారు. ఏప్రిల్ 15 వరకూ వచ్చే కొత్త ఓటర్ల దరఖాస్తులను వెంటనే విచారణ జరిపి ఈఆర్వో ఆమోదానికి సిద్ధం చేయాలని ఏఆర్వో అప్పలరాజు సూచించారు. పోలింగ్ ముందు రోజైన మే12 వ తేదీ నుంచి సిబ్బందికి ఇబ్బందులు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యతతో పాటు ఈవీఎంలను అప్పగించే వరకు పీవోలకు సహాయకారులుగా ఉండాలని సూచించారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే అధికారుల దృష్టికి తేవాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన దగ్గర్నుంచి ప్రవర్తనా నియమావళి అమలులో ఉందని ఇంకా ఎక్కడైనా రాజకీయ పార్టీల బ్యానర్లు,జెండాలు,స్టిక్కర్లు,ఫోటోలు ఉంటే వెంటనే తొలగించాలని, ఒకవేళ ఎవరైనా ఇళ్లపై తొలగించిన జెండాలు మళ్లీ పెడితే వాటిని కూడా తొలగించాలని సూచించారు. సమావేశానికి పలువురు బీఎల్వోలు ఆలస్యంగా రావడం, కొందరు గైర్హాజరు కావడంపై ఆర్వో మనోరమ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యలమంచిలి, మునగపాక, రాంబిల్లి,అచ్యుతాపురం తహసీల్దార్లు అప్పలరాజు, పాపారావు, అప్పలస్వామి, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

జిల్లా స్థాయి చిత్రలేఖనం పోటీలకు సిద్ధం



విద్యార్థులు వేసిన చిత్రాలతో డ్రాయింగ్ టీచర్ కృష్ణ

కోటవురట్ల: ఉగాది సందర్భంగా చిత్రలేఖనం పోటీలకు విద్యార్థులు సిద్ధమని హెచ్ఎం షేక్ అల్లావుద్దీన్ తెలిపారు. జిల్లా స్థాయిలో జరిగే చిత్రలేఖనం పోటీలకు విద్యార్థులు తమలోని ప్రతిభను చాటుతూ పలు చిత్రాలు గీశారు. దేశభక్తిని చాటుతూ విద్యార్థులు వేసిన చిత్రాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ సందర్భంగా హెచ్ఎం షేక్ అల్లా వుద్దీన్ విద్యార్థులను, తర్ఫీదునిచ్చిన డ్రాయింగ్ టీచర్ కృష్ణను అభినందించారు. విద్యార్థులు వేసిన చిత్రాలను జిల్లా స్థాయి పోటీలకు పంపించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు జె.వి.ప్రసాదరావు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



రాము మృతదేహం

రాంబిల్లి : సింబయో ఫార్మా కంపెనీలో ఈ నెల 14న జరిగిన ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ పెదకలవలాపల్లి గ్రామానికి చెందిన కె.నర్సింగరావు బుధవారం మృతి చెందాడు. రెండు రోజుల క్రితం చోడవరం మండలం గోవాడకు చెందిన ఎ.రాము చికిత్స పొందుతూ మృతి చెందాడు. వీరికి ఒక్కొక్కరికి కంపెనీ యాజమాన్యం రూ. 20 లక్షలు, కాంట్రాక్టర్ నుంచి ఒక్కొక్కరికి రెండే సి లక్షలు చొప్పున ఆర్థిక సాయం అందించేందుకు ఒప్పందం జరిగినట్టు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దేముడునాయుడు తెలిపారు. బాయిలర్ వద్ద రసాయనాలతో కూడి వేడి నీటి ద్రావణం పడడంతో రాము, నర్సింగరావు, సన్యాసిరావు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో రాము, నర్సింగరావు మృత్యువాత పడ్డారు.

వైభవంగా మరిడిమాంబ విగ్రహ ప్రతిష్ట



మరిడిమాంబను దర్శించుకుంటున్న సర్పంచ్ పీలా ఉషా అప్పారావు దంపతులు

అనకాపల్లి: మండలంలోని దిబ్బపాలెం గ్రామంలో బుధవారం మరిడిమాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా జరిగింది. మరిడిమాంబ దివ్యయంత్ర, శిఖర ప్రతిష్ట, అమ్మవారి విగ్రహ ఆవిష్కరణ మహోత్సవాన్ని ప్రముఖ వేదపండితులు బంకుపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారి ఆలయం వద్ద కళాహవనములు గర్త, రత్న, బీజన్యాసములు, శిఖర, యంత్ర ప్రతిష్ట, నేత్రోత్సవం, కూష్మాండబలి, ధేను, దర్పణ దర్శనం వంటి కార్యక్రమాలను వేదపండితులు చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిగింది. అమ్మవారి విగ్రహదాతలు పీలా సూరిఅప్పారావు లక్ష్మి, కనకదుర్గారావు లక్ష్మీదేవి దంపతులు పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పీలా ఉషా అప్పారావు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి యువకుడికి గాయాలు

సబ్బవరం: మండలంలోని సబ్బవరం-చోడవరం రోడ్డులోని బంగారమ్మపాలెం వద్ద బుధవారం ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో ఓ యువకుడికి గాయాలయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు,స్థానికులు సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించడంతో వైద్య సిబ్బంది వైద్య సేవలు అందించారు. వివరాలు.. మండలంలోని బంగారమ్మపాలేనికి చెందిన సాలాపు శ్రీను విజయనగరం కొత్తవలస మండలం మంగళపాలెంలో తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నారు.బంగారమ్మపాలెంలో ముత్యాలమ్మ పండగ ఉండడంతో ఇటీవల స్వగ్రామానికి వచ్చారు.శ్రీను ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అదుపు తప్పడంతో గాయాలయ్యాయి. ప్రధాన వైద్యాధికారి డాక్టర్ చక్రవర్తి సిబ్బందితో కలిసి సకాలంలో వైద్య సేవలు అందించారు.

ఐక్యంగా పనిచేసి భారీ మెజార్టీ తేవాలి

ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు



ఏటికొప్పాకలో ముఖ్య నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబు

యలమంచిలి : రాష్ట్రంలో మళ్లీ సంక్షేమ పాలన జరగాలంటే వచ్చే ఎన్నికల్లో మళ్లీ వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిని సీఎం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్క వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై ఉందని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు(కన్నబాబు) అన్నారు. బుధవారం మండలంలోని ఏటికొప్పాకలో బండిమాంబ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సెంటిమెంట్ ప్రకారం గ్రామంలో పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. గ్రూపులు వీడి పార్టీ గెలుపునకు కృషి చేయాలని సూచించారు. కొంతకాలంగా గ్రామంలో రెండు వర్గాలుగా ఉన్న వైఎస్సార్సీపీ నాయకుల మధ్య సయోధ్య కుదిర్చిన ఎమ్మెల్యే ఇకపై మీరంతా ఐక్యంగా ఉండి కలిసి ప్రచారం నిర్వహించాలని కోరారు. కులమత, రాజకీయాలకతీతంగా అన్ని వర్గాల ప్రజలకు అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందించిన సంక్షేమ ప్రదాత సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. ఈ ప్రభుత్వాన్ని మరోమారు అధికారంలోకి తెచ్చుకోవాల్సిన అవసరం రాష్ట్రానికి ఉందన్నారు. ఏటికొప్పాకలో భారీ మెజార్టీ తెచ్చేలా పార్టీ నాయకులంతా పనిచేయాలని కోరారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి జగనన్న చేసిన లబ్ధిని వివరించాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, రాజాబాబు, ఎంపీపీ బోదెపు గోవింద్, మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు ఎర్రయ్యదొర, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు రాజాన శేషు,గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు సేనాపతి రాము, నగిరెడ్డి అచ్చియ్యనాయుడు, కరణం రవి, వీసం బంగారి, యాటీఆర్, వీసం వాసు కరణం వెంకట్రావు పాల్గొన్నారు.

తాగునీరు, పారిశుధ్య సమస్యలు పరిష్కరించాలి

పాయకరావుపేట: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, గ్రామాల్లో పారిశుధ్య లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కె.స్వప్న అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. వేసవి సందర్భంగా గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పనుల వద్ద నీడ, తాగునీరు సౌకర్యం కల్పించాలన్నారు. వాటర్ ట్యాంకులు ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలన్నారు. ఇంటి పన్నులు వసూలు చేయాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్, ఎన్ఆర్‌ఈజీఎస్, మండల స్థాయి అధికారులు, ఈవోఆర్‌డీ సిహెచ్.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రాజుబాబును పరామర్శించిన ఎమ్మెల్యే కంబాల



ఎద్దు రాజుబాబును పరామర్శిస్తున్న కంబాల జోగులు

పాయకరావుపేట : మండలంలో గల అరట్లకోట ఎంపీటీసీ ఎద్దు సవిత తండ్రి రాజుబాబు ను పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు పరామర్శించారు. రాజుబాబు ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకుని, ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటున్నారు. పాయకరావుపేటలో గల రాజుబాబు నివాసానికి వెళ్లిన జోగులు ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షులు చిక్కాల రామారావు, పార్టీ ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, జెడ్పీటీసీ లంక సూరిబాబు, మాజీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, పట్టణ యూత్ అధ్యక్షుడు పిరాది రాజు, నాయకులు తూము రాజుబాబు, తూము రమణ, కట్టా అప్పారావు పాల్గొన్నారు.

ముగిసిన టెన్త్ ప్రధాన పరీక్షలు



పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు



కొత్తపేట జెడ్పీ పాఠశాల కేంద్రం నుంచి పరీక్ష రాసి బయటకొస్తున్న విద్యార్థులు

ఎస్.రాయవరం : ఈ నెల 18 నుంచి ప్రారంభమైన 10వ తరగతి పరీక్షలు బుధవారంతో ముగిసాయి. ఎస్.రాయవరం, పి.ధర్మవరం, దార్లపూడి, తిమ్మాపురం, కొరుప్రోలు పాఠశాల లోని పరీక్ష కేంద్రాల్లో 1067 మంది రెగ్యులర్ విద్యార్థులు, 57 మంది ప్రయివేటు విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా మొదటి రోజు 11 మంది హాజరు కాలేదు. ఈ 11 మంది చివరి వరకు పరీక్షలకు హాజరు కాలేదని, మిగిలిన వారంతా సజావుగా పరీక్షలు రాశారని ఎంఈవో మూర్తి తెలిపారు.

యలమంచిలి రూరల్ : పట్టణంలో పదో తరగతి పరీక్షలు బుధవారంతో ప్రశాంతంగా ముగిశాయి.ఈ నెల 18వ తేదీన ప్రారంభమైన ఈ పరీక్షలు 4 కేంద్రాల్లో నిర్వహించారు. శనివారం సోషల్ స్టడీస్ పరీక్ష ముగిసిన వెంటనే విద్యార్థులు పరీక్ష కేంద్రాల నుంచి ఉత్సాహంగా బయటకొచ్చారు. మరికొందరు విద్యార్థులు ఉత్సాహంగా కేరింతలు కొడుతూ స్నేహితులతో రెస్టారెంట్లకు వెళ్లారు. హమ్మయ్య పరీక్షలు పూర్తయ్యాయంటూ విద్యార్థులంతా హుషారుగా కనిపించారు.

గట్టి బందోబస్తు

పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పట్టణ ఎస్ఐ పాపినాయుడు, ఏఎస్ఐ చెల్లారావు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులు పరీక్షలు ముగియడంతో వారిని తల్లిదండ్రులు ఇళ్లకు తీసుకెళ్లారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించడంలో అధికారులు విజయవంతంగా కృషి చేశారని ఎంఈవో మీనాక్షి తెలిపారు.

తుది దశకు ఐసోలేషన్ సెంటర్ పనులు



సబ్బవరం పీహెచ్‌సీ ప్రాంగణంలో శరవేగంగా సాగుతున్న ఐసోలేషన్ సెంటర్ పనులు

సబ్బవరం: సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న ఐసోలేషన్ సెంటర్ పనులు తుదిదశకు చేరుకున్నాయి. దీంతో త్వరలో ప్రారంభించడానికి సిద్ధం చేస్తున్నారు. అలాగే గుల్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో కూడా రూ.10 లక్షలతో ఐసోలేషన్ సెంటర్ నిర్మించనున్నారు.కోవిడ్ వంటి పలు రకాల అంటు వ్యాధులు విజృంభించే సమయంలో ప్రత్యేకంగా రోగులకు వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ఈ సెంటర్ నిర్మాణం చేపట్టారు. ఆర్నెల్ల కింద ఈ పనులకు ఎంపీపీ సూర్యకుమారితో కలిసి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. త్వరలో సేవలందించేందుకు ఐసోలేషన్ సెంటర్ అందుబాటులోకి రానుంది.

కార్పెంటర్స్ సమస్యల పరిష్కారానికి కృషి

అనకాపల్లి: పట్టణ పరిధిలో కార్పెంటర్స్ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి, వాటి పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషిచేయనున్నట్లు కార్పెంటర్స్(వడ్రంగి) సంఘం పట్టణ అధ్యక్షుడు వానపల్లి కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక గవరపాలెం కామాక్షి అమ్మవారి ఆలయం వద్ద నుంచి కార్పెంటర్స్ డే పురస్కరించుకుని ఎన్టీఆర్ వైద్యాలయంలో రోగులకు రొట్టెలు, పాలు పంపిణీ చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు కోసూరి మన్మథరావు, ప్రధాన కార్యదర్శి సింహాద్రి కోటేశ్వరరావు, కోశాధికారి మునాసన రామకృష్ణ, పట్టణ కామాక్షి కార్పెంటర్స్ సంఘం సభ్యులు, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



కార్పెంటర్స్ డే సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న కార్పెంటర్స్ సంఘాల సభ్యులు

ఎన్నికల వేళ ప్రతిపక్షాల కుట్రలు భగ్నం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు

ఎస్.రాయవరం : ఎన్నికల వేళ గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రతిపక్షాల కుట్రలు భగ్నం చేయాలని పాయకరావుపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. అడ్డురోడ్డు క్యాంపు కార్యాలయం వద్ద ఎన్నికల ప్రచారం గ్రామాల్లో నిర్వహించే ప్రణాళికను సిద్ధం చేసేందుకు స్థానిక నాయకులతో బుధవారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమంతో ప్రశాంతంగా ఉన్న ప్రజలను మభ్య పెట్టేందుకు మహాకూటమి అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారన్నారు. అధికారంలోనికి వస్తే ప్రజలకి ఏ మేలు చేస్తారో చెప్పకుండా సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా పేద ప్రజలని గుర్తు పెట్టుకున్న వ్యక్తి జగన్ మోహన్‌రెడ్డి అని తాము ఎన్నికల్లో విశ్వాసం చూపించి మరళా ఆ బాబునే సీఎంగా ఎన్నుకుంటామని చెప్పారన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా జగనన్న పాలన అందించారని, వలంటీర్ల వ్యవస్థ తీసుకువచ్చి ప్రభుత్వ పథకాలు నిజమైన అర్హులకు సకాలంలో అందించేలా చేశారన్నారు. ఆయా సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు వివరించి ఫ్యాను గుర్తుకు ఓటు వేసేలా పార్టీ శ్రేణులంతా కృషి చేయాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు,సర్పంచ్ ల సంఘ అధ్యక్షులు కర్రి సత్యనారాయణ, జిల్లా పార్టి కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, పార్టి నాయకులు శ్రీపతిరాజు,గుడివాడ సర్పంచ్ దూళి శ్రీనుబాబు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



పైడిమాంబ ఆలయం వద్ద హోమం



భజన చేస్తున్న భక్తులు

రాంబిల్లి: మామిడివాడలో పైడిమాంబ ఆలయం ప్రారంభం సందర్భంగా బుధవారం హోమం, పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలు గ్రామాలకు చెందిన భజన బృందాలు భజనలు చేసాయి. గురువారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, ఆలయం ప్రారంభం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు యు.వి.రమణమూర్తిరాజు, కరణం ధర్మశ్రీ హాజరు కానున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

తోటాడలో వచ్చే నెల 9న భావనారుషి,భద్రావతిల కళ్యాణం

9న తోటాడలో భావనారుషి, భద్రావతిల కల్యాణం



కల్యాణ మహోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మునగపాక : మండలంలోని తోటాడలో పురాతన శ్రీ భావనారుషి కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో వచ్చేనెల 9న భావనారుషి, భద్రావతిల కల్యాణం ఘనంగా నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. పద్మశాలీ సేవాసంఘం ఆధ్వర్యంలో బుధవారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆలయ ధర్మకర్తలు దొడ్డి త్రినాథ్, సన్యాసిరావు, తాతబ్బాయిలు మాట్లాడుతూ తమ పూర్వీకుల నుంచి ఉగాది పర్వదిన సందర్భంగా కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ అని తెలిపారు. ఆరోజు రాత్రి 7 గంటలకు ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక మండపంపై ఉంచి కల్యాణోత్సవం జరిపిస్తామన్నారు. అదేరోజు ఉదయం 6 గంటల నుంచి ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగిస్తారన్నారు. అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గెడ్డం బాబూరావు, సూరిశెట్టి నమశ్శివాయ, నూకలక్ష్మి, నారాయణ, సూరిబాబు, రమణ, కుమార్‌రాజా, ప్రభాకర్ పాల్గొన్నారు.

కుంచావారి గౌరీపరమేశ్వరుల విగ్రహ ప్రతిష్ట



గౌరీపరమేశ్వరుల పంచలోహ విగ్రహాన్ని ఊరేగిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డు పెరుగు బజార్ జంక్షన్ కుంచావారి గౌరీపరమేశ్వరుల పంచలోహ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పంచలోహ విగ్రహాన్ని స్వామివారి రథంపై పురవీధుల్లో ఊరేగించారు. గౌరీపరమేశ్వరుల ఆలయం వద్ద విఘ్నేశ్వర పూజ, శుద్ధపుణ్యాహవచనం, సకలదేవత మండపారాధన, రుద్రహోమం, జలాధివాసం, క్షీరాధివాసం, ధాన్యాధివాసం, పుష్పాధివాసం, 108 కలశ స్థాపన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తు లు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ ఎం.వీరభద్రరావు, గౌరవాధ్యక్షుడు పొంద్రంకి సత్యారావు, సభ్యులు కోరుకొండ సాంబశివరావు, కొమ్మోజి రామకృష్ణ, పాలూరి శ్రీనివాసరావు, విశ్రాంత మెడికల్ సూపరింటెండెంట్ ధర్మాల సాంబమూర్తి పాల్గొన్నారు.

ఘనంగా సీతారామాంజనేయ విగ్రహ ప్రతిష్ట

మాడుగుల రూరల్: తాటిపర్తిలో నూతనంగా నిర్మించిన సీతారామాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామివార్ల విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. అనంతరం వేద పండితులు గణపతి పూజ రక్షాబంధన్, నవగ్రహ మండపారాధన కార్యక్రమాలు నిర్వహించారు.

దొండపూడి ఫారెస్ట్ ఠాణా వద్ద విస్తృత తనిఖీలు

రావికమతం/చోడవరం రూరల్ : దొండపూడి ఫారెస్ట్ ఠాణా వద్ద కొత్తకోట పోలీసులు వాహనాల తనిఖీలు చేశారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో బుధవారం ఒక్కరోజే 120 వాహనాలను తనిఖీ చేశామని సీఐ అప్పలనాయుడు తెలిపారు. వెంకన్నపాలెం జంక్షన్‌లో చోడవరం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులు

కోటవురట్ల: స్థానిక కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఎస్‌వో సరితాదేవి తెలిపారు. ఆమె మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరానికి గాను 6, 7, 8 తరగతులు, ఇంటర్మీడియట్ బైపీసీ మొదటి సంవత్సరంలోకి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఏప్రిల్ 11వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

టెన్త్ పరీక్షలకు 369 మంది హాజరు

కోటవురట్ల : పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఉన్న పరీక్షా కేంద్రాల్లో కె.వెంకటాపురం, జల్లూరు జెడ్పీ హైస్కూల్, కోటవురట్ల జెడ్పీ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 369 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పర్యవేక్షించారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థుల కళ్లల్లో సంతోషం తాండవించింది.

ఇంటింటికీ తాగునీరు అందించేందుకు కృషి

మునగపాక: జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీరు పుష్కలంగా అందుతుందని మూలపేట సర్పంచ్ బీశెట్టి గంగప్పలనాయుడు అన్నారు. మూలపేట శివారు గంగాదేవిపేటలో జల్‌జీవన్ మిషన్ ద్వారా మంజూరైన రూ.43 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న రక్షిత మంచినీటి పథకం పనులను ఆయన బుధవారం స్థానిక ఉప సర్పంచ్ మొల్లేటి దేవితో కలిసి పరిశీలించారు. ప్రతి ఇంటికి శుద్ధమైన నీటిని అందించేందుకు ఎమ్మెల్యే రమణమూర్తిరాజు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు.

నేడు చూచుకొండలో నూకాంబిక అమ్మవారి విగ్రహ ప్రతిష్ట

మునగపాక : చూచుకొండలో గురువారం నూకాంబిక అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఉదయం నుంచి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన జరుగుతుందన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కోరారు.